# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 7 జూలై 2025 | పేజీలు 8


# అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటు

- ప్రాజెక్టు లిఫ్టులపై ఈ నెల 11న ఎన్‌సీఐడబ్ల్యూఏఎం సమావేశంలో నిర్ణయిస్తాం
- కన్నెపల్లి పంప్‌హౌస్‌పై హరీశ్‌ది ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి ఏటా జులై నెల చివర్లో లేదా ఆగస్టు 1న కల్వకుర్తి మోటార్లకు స్విచ్ ఆన్ చేసి వానాకాలం పంటలకు నీరందిస్తారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈసారి కూడా ఇదే విధానం అమలవుతుందని, రైతులు సందేహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు పదేపదే మాట్లాడటం వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర ఉందని ఆక్షేపించారు. గోబెల్స్‌కు మించి అబద్ధాలను ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటుగా మారిందన్నారు. కల్వకుర్తి లిఫ్టు ఎప్పుడు ఆన్ చేయాలో తమకు తెలుసని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. “2019లో ఆగస్టు 11న, 2020లో ఆగస్టు 31న, 2021లో ఆగస్టు 15న, 2022లో

-2 లో

# రూ.4,215 కోట్ల స్కాం... ఫాల్కన్ కంపెనీ సీఓఓను అరెస్ట్ చేసిన తెలంగాణ సీఐడీ

- రూ.4,215 కోట్ల ఫాల్కన్ యాప్ స్కామ్‌లో కీలక అరెస్ట్
- ఫాల్కన్ గ్రూప్ సీఓఓ ఆర్యన్ సింగ్‌ను పట్టుకున్న తెలంగాణ సీఐడీ
- పంజాబ్‌లోని భటిండాలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఫేక్ యాప్ ద్వారా అధిక వడ్డీ ఆశ చూపి భారీ మోసం
- దేశవ్యాప్తంగా 7 వేల మంది నుంచి డిపాజిట్లు సేకరణ
- ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 10 మంది అరెస్ట్

-2 లో



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రూ. 4,215 కోట్ల ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ యాప్ స్కామ్‌లో తెలంగాణ సీఐడీ అధికారులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఫాల్కన్ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) ఆర్యన్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని భటిండాలో జులై 4న అతడిని అదుపులోకి తీసుకున్న ప్రత్యేక బృందం, ట్రాన్సిట్ రిమాండ్‌పై ఆదివారం హైదరాబాద్‌కు తరలించింది. అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా వెల్లడించారు.

**మోసం చేసిందిలా...!**

క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ‘ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్’ పేరుతో ఒక మొబైల్ అప్లికేషన్‌ను సృష్టించింది. ప్రముఖ బహుళజాతి కంపెనీల పేరుతో నకిలీ డీల్స్ సృష్టించి, స్వల్పకాలిక పెట్టుబడులపై అధిక వడ్డీ ఇస్తామంటూ సోషల్ మీడియా, టెలీకాలర్ల ద్వారా విపరీతంగా ప్రచారం చేశారు. దీనిని నమ్మిన అమాయక ప్రజల



# వారం రోజుల్లో కన్నెపల్లి మోటార్లు ఆన్ చెయ్యాలి

- అక్కడ కనీస స్థాయి కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లున్నాయి
- ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటే.. కేసీఆర్ నాయకత్వంలో లక్షల మంది రైతులతో అక్కడికి కదులుతాం
- సర్కారుకు మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కనీస నీరు తీసుకునే స్థాయి(మినిమం డ్రాడౌన్ లెవెల్-ఎండీడీఎల్) కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లున్నా మోటార్లను ఎందుకు ఆన్ చేయడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మేడిగడ్డ మరమ్మతులతో సంబంధం లేకుండా కన్నెపల్లి నుంచి నీళ్లు తీసుకోవడానికి అవకాశాలున్నాయన్నారు. ఓవైపు సాగునీటి కోసం రైతాంగం అల్లాడుతుంటే.. ప్రభుత్వం ఉదాసీనంగా ఉండటం తగదని హితవు పలికారు. రైతులను ఆదుకోవడానికి తక్షణమే పంప్‌హౌస్ మోటార్లను ప్రభుత్వం ప్రారంభిస్తుందా, లేదంటే రైతులే ఉద్యమంగా వెళ్లి ఆన్ చేసుకోవాలా? అని నిలదీశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే.. కేసీఆర్ నాయకత్వంలో అన్ని జిల్లాల నుంచి లక్షల మంది రైతులతో పంప్‌హౌస్‌కి

-2 లో

# తెలంగాణలో 1,07,218 ఇంజినీరింగ్ సీట్లు

## ఉన్నత విద్యామండలి ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం నేపథ్యంలో ఉన్నత విద్యా మండలి కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్ని ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి? వాటిలో భర్తీ చేసే సీట్ల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తంగా 171 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,07,218 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. వీటిలో కన్వీనర్ కోటా (70శాతం) కింద 76,795 సీట్లు భర్తీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తూ ప్రత్యేక జాబితాను విడుదల చేసింది. మరోవైపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు

-2 లో

# 'కన్నెపల్లి' మోటార్లు ఎందుకు ప్రారంభించరు?

- మొదటి పేజీ తరువాయి

తరలివెళ్లి మోటార్లను ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మధుసూదనాచారి, కల్వకుంట్ల సంజయ్, సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పద్మా దేవేందర్‌రెడ్డి, దేవీప్రసాద్ తదితరులతో కలిసి ఆదివారం హరీశ్‌రావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులున్నాయి. సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విత్తనాలు వేసే, వేసినవి మొలకెత్తే పరిస్థితులు లేవు. చాలాచోట్ల ప్రాజెక్టుల కింద నారుమళ్లు పోయాలా, వద్దా? అని ఆలోచిస్తున్నారు. భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే.. సాగునీటికే కాదు, పలు జిల్లాల్లో తాగునీటికీ ఇబ్బందులు ఎదురవుతాయి. మహారాష్ట్ర, కర్ణాటకల్లో వర్షాలు కురవడం వల్ల కృష్ణా, గోదావరి నదుల్లో మే నెలలోనే వరదలొచ్చాయి. వరదను ఒడిసిపట్టి.. ఎక్కడికక్కడ ప్రాజెక్టుల్లో మోటార్లు ఆన్ చేసి.. రిజర్వాయర్లు, చెరువులు, చెక్‌డ్యాములు నింపుకోవాల్సిందిపోయి.. ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ముఖ్యమంత్రి, మంత్రులు భారత రాష్ట్ర సమితిపై బురద చల్లడంలో పోటీపడుతున్నారు. కరవును పారదోలే కాళేశ్వరం ప్రాజెక్టును.. కేసీఆర్‌పై కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనబెడుతోంది. భారత రాష్ట్ర సమితిపై కోపముంటే.. మాపై కక్ష సాధించండి. రైతులకు ఎందుకు శిక్ష వేస్తున్నారు?

**నీళ్ల విలువ తెలియని నాయకుడు రేవంత్**

నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే.. వాటిని మళ్లించుకునే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. కానీ, రేవంత్‌రెడ్డి నీళ్ల విలువ తెలియని నాయకుడు. వరద వచ్చి నెల రోజులు దాటినా మోటార్లను ప్రారంభించలేదు. కళ్ల ముందు నుంచి నీళ్లు పోతోంటే పట్టించుకోని ప్రభుత్వం తీరు.. నేరపూరిత నిర్లక్ష్యం కిందికే వస్తుంది. మేడిగడ్డలో రెండు పియర్స్ కుంగాయనే సాకుతో ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టింది. అయితే మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీళ్లు తీసుకునే అవకాశముంది. మేడిగడ్డ దగ్గర ప్రస్తుతం 73,600 క్యూసెక్కుల నీళ్లు ప్రవహిస్తున్నాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ మినిమం డ్రాడౌన్ లెవెల్(ఎండీడీఎల్) 93.5 మీటర్లు. ఇప్పుడు నదీ ప్రవాహస్థాయి 96 మీటర్ల ఎత్తులో ఉంది. అంటే ఎండీడీఎల్ కంటే రెండున్నర మీటర్ల ఎక్కువ ఎత్తులో నీళ్లు పోతున్నాయి. రోజుకు రెండు టీఎంసీలు తీసుకునే అవకాశముంది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై శాసనమండలిలో ఎమ్మెల్సీ కోదండరాం అడిగిన ప్రశ్నకు ఆ రెండు బ్యారేజీలూ బాగున్నాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానమిచ్చారు. అన్నారం, సుందిళ్ల, కన్నెపల్లి పంప్‌హౌస్ లక్షణంగా పనిచేస్తున్నప్పుడు.. బటన్ నొక్కి నీళ్లు తీసుకోవడంలో నిర్లక్ష్యమెందుకు? ఈరోజు కాళేశ్వరం మోటార్లు ప్రారంభిస్తే.. 15 జిల్లాలకు నీళ్లొచ్చే అవకాశముంది. వెంటనే మోటార్లు ప్రారంభించి.. రిజర్వాయర్లు నింపి.. పంటకు నీళ్లివ్వాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే ప్రభుత్వాన్ని విడిచిపెట్టం. ప్రజా బలమేంటో చూపిస్తాం.

**పాలమూరు రైతుల కడుపు కొడుతున్నారు**

కృష్ణా నదిలోనూ ఇదే పరిస్థితి. తాను పాలమూరు బిడ్డనని ముఖ్యమంత్రి పదేపదే చెబుతుంటారు. కానీ, పాలమూరు రైతుల కడుపు కొడుతున్నారు. శ్రీశైలంలో మే 30న వరద వచ్చింది. ఇప్పటివరకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయలేదు. నాటి తెదేపా, కాంగ్రెస్ ప్రభుత్వాలు కల్వకుర్తి ప్రాజెక్టును పట్టించుకోకపోతే.. కేసీఆర్ వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి.. మూడు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారు. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. చంద్రబాబు కోసం 65 టీఎంసీలను రేవంత్‌రెడ్డి ధారాదత్తం చేశారు. ఈ ఏడాది కూడా వరద నీరు ముందే వచ్చినా.. మోటార్లు ఆన్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తోంది. వెంటనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేయకపోతే.. మహబూబ్‌నగర్ భారత రాష్ట్ర సమితి నాయకులు వేల మంది రైతులతో కలిసి ప్రాజెక్టు వద్దకెళ్లి.. మోటార్లు ప్రారంభించే పరిస్థితి వస్తుంది" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

# అబద్ధాలను గోబెల్స్‌కు మించి ప్రచారం చేయడం హరీశ్‌రావుకు అలవాటు

- మొదటి పేజీ తరువాయి

జులై 13న, 2023లో ఆగస్టు 6న కల్వకుర్తి పంపులను ఆన్ చేశారు. గతేడాది జులై 27న స్విచ్ ఆన్ చేశారు. ఈనెల 11న జరిగే స్టేట్ లెవల్ కమిటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ వాటర్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్(ఎస్‌సీఐడబ్ల్యూఏఎం) సమావేశంలో తీసుకునే నిర్ణయాల ఆధారంగా అన్ని సాగునీటి ప్రాజెక్టులు, ఆయకట్టుకు ప్రణాళిక సిద్ధమవుతుంది. రైతుల అవసరాలు, నీటి నిల్వల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిని ఎప్పుడు విడుదల చేయాలి. ఎంత ఆయకట్టుకు సాగునీరు అందించాలి.. ఎంత సమర్థంగా నీటిని వాడుకోవాలి అన్న అంశాలపై ప్రభుత్వం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుంది.

కల్లబొల్లి మాటలు నమ్మాల్సిన అవసరంలేదు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటి విడుదలపై హరీశ్‌రావు కల్లబొల్లి మాటలు నమ్మాల్సిన అవసరం మాకు లేదు. గతంలో మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రంలోకి వదిలి ప్రజాధనాన్ని వృథా చేసిన విషయం మరిచిపోయారా? కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేసిన ప్రకారం మేడిగడ్డ దగ్గర కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి అన్నారం.., అక్కడి నుంచి సుందిళ్లకు నీటిని ఎత్తిపోయాలి. ఆ మూడు బ్యారేజీలు తప్పుడు సాంకేతిక పరిజ్ఞానం, ఆకృతితో గత ప్రభుత్వం నిర్మించింది. ఈ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరించింది. భారత రాష్ట్ర సమితి అసమర్థత, నిర్లక్ష్యంతో మేడిగడ్డ కుంగిపోయింది. అన్నారం, సుందిళ్ల ప్రమాదకరంగా మారాయి. ఎన్‌డీఎస్‌ఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుంది. కృష్ణా జలాలను ఏపీ అక్రమంగా తరలించడం వెనక నాటి భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ కుట్ర బయటపడింది. పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంచడం, రాయలసీమ ఎత్తిపోతల ద్వారా నీటిని ఏపీ మళ్లించుకునే కుట్రలకు భారత రాష్ట్ర సమితి చాటుగా సహకరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి. దేశ చరిత్రలో ఒకే ఏడాది 283 లక్షల టన్నుల ధాన్యం సాధించిన రికార్డు మా సర్కారుది. ఇప్పటికైనా హరీశ్‌రావు అబద్ధాలు మాట్లాడటం మానుకోవాలి" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# రూ.4,215 కోట్ల స్కాం... ఫాల్కన్ కంపెనీ సీఓఓను అరెస్ట్ చేసిన తెలంగాణ సీఐడీ

- మొదటి పేజీ తరువాయి

నుంచి భారీగా డిపాజిట్లు సేకరించారు. ఈ స్కామ్ ద్వారా నిందితులు దేశవ్యాప్తంగా 7,056 మంది నుంచి సుమారు రూ.4,215 కోట్లు వసూలు చేశారు. వీరిలో 4,065 మంది బాధితులు రూ.792 కోట్లు నష్టపోయినట్లు సీఐడీ విచారణలో తేలింది. బాధితుల ఫిర్యాదుల మేరకు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీస్ స్టేషన్‌లో మూడు కేసులు నమోదు కాగా, వాటిని తదుపరి దర్యాప్తు కోసం సీఐడీకి బదిలీ చేశారు. ఈ సంస్థపై దేశవ్యాప్తంగా మరో ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

**సీఓఓ ఆర్యన్ సింగ్ పాత్ర**

ఈ కేసులో ఐదో నిందితుడిగా ఉన్న ఆర్యన్ సింగ్, కంపెనీ ఎండీ అమర్ దీప్ కుమార్‌తో కలిసి మోసాల్లో చురుకైన పాత్ర పోషించాడు. బాధితులతో నేరుగా మాట్లాడుతూ, నకిలీ రశీదులు ఇస్తూ ఈ స్కామ్‌కు ముఖచిత్రంలా వ్యవహరించాడు. ఇతను ఒక్కడే రూ.14.35 కోట్ల కీలక డిపాజిట్లను సేకరించినట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, కంపెనీ నిధుల నుంచి రూ.1.62 కోట్లను తన సొంత ఖాతాకు మళ్లించుకున్నాడు. నేరం బయటపడగానే ఆర్యన్ సింగ్ మొదట నాందేడ్‌కు, అక్కడి నుంచి పంజాబ్‌లోని భటిండాకు పారిపోయి ఒక గురుద్వారాలో తలదాచుకున్నాడు. పక్కా సమాచారంతో అక్కడికి వెళ్లిన సీఐడీ బృందం అతడిని అరెస్ట్ చేసి, రెండు సెల్‌ఫోన్లు, కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఇప్పటివరకు ఆర్యన్ సింగ్‌తో కలిపి మొత్తం 10 మందిని అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని సీఐడీ అధికారులు తెలిపారు.

# తెలంగాణలో 1,07,218 ఇంజినీరింగ్ సీట్లు

- మొదటి పేజీ తరువాయి

జులై 8వ తేదీ ఆఖరి గడువు అని తెలిపింది. అడ్మిషన్ల కోసం 95,654మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని.. 76,494మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలంగాణ సాంకేతిక విద్య కమిషనర్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు. కన్వీనర్ కోటాలో బ్రాంచ్‌ల వారీగా అందుబాటు లో ఉన్న సీట్ల వివరాలను ఈ కింది పీడీఎఫ్‌లో చూడొచ్చు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేసిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నూరులోని కోటిపల్లి మండల కేంద్రంలో ఉన్న సివిల్ సప్లైస్ గోదాంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి వివేక్. చెన్నూరు నియోజకవర్గంలో రూ. 500 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ప్రతిరోజూ మార్నింగ్ వాక్‌లో ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నానని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని అన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఇసుక మాఫియా పూర్తిగా అదుపులో ఉందని.. అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిని ఏమాత్రం ఉపేక్షించమని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందని.. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అందజేస్తోందని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా వంటి పథకాలు ఇప్పటికే అమలులో ఉన్నాయని అన్నారు మంత్రి వివేక్. కేవలం 9 రోజుల్లో రూ. 9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని అన్నారు. టింగ్ టింగ్ అని ఖాతాల్లోకి డబ్బులు వచ్చాయని రైతులు చెబుతున్నారని అన్నారు. మంత్రిగా ఛార్జ్ తీసుకున్నప్పటి నుండే అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం మోపామని అన్నారు. ప్రతిపక్షాలు కావాలనే ఫేక్ ప్రచారం చేస్తున్నాయని.. ఇలాంటి దుష్ప్రచారాలపై పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా పెట్టి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు మంత్రి వివేక్.

## తీరిన చెన్నూర్ ప్రజల చిరకాల వాంఛ.. హైదరాబాద్-చెన్నూరు బస్ సర్వీస్ ప్రారంభించిన మంత్రి వివేక్




**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నూర్ ప్రజల చిరకాల వాంఛ అయిన హైదరాబాద్–చెన్నూరు బస్ సర్వీసును ప్రారంభించినట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం (జూలై 6) చెన్నూర్ పట్టణంలోని కొత్త బస్ స్టాండ్?లో 5 కొత్త బస్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. చెన్నూర్ నుంచి హైదరాబాద్?తో పాటు పలు ప్రాంతాలకు నూతన సర్వీసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ.. చెన్నూర్ పట్టణంలో బస్ డిపో కావాలని ప్రజలు కోరుతున్నారని.. అయితే బస్ డిపో కోసం ఇప్పటికే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్?తో మాట్లాడానని ఆయన తెలిపారు. డిపోకు సంబంధించిన భూ వివాదం ఉండటంతో పనులు ఆగిపోయాయని క్లారిటీ ఇచ్చారు. డిపో ఏర్పాటు చేసే భూమికి సంబంధించి ఎవరైతే కేసు పెట్టారో.. కేసును వాపసు తీసుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## తిరుమలలో భక్తుల రద్దీ ఆదివారం ఎంతగా ఉందో తెలిస్తే?

**హైదరాబాద్ పెన్ పవర్:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. గత నాలుగు రోజుల నుంచి తిరుమలలో భక్తులతో కిటకిటలాడిపోతుంది. గత రెండు నెలలుగా తిరుమలలో ఇదే పరిస్థితి నెలకొంది. వేసవి రద్దీ మొత్తం జూన్, జులై నెలల్లోనే కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. మొక్కులు తీర్చుకోవడానికి పాఠశాలలు తెరిచినప్పటికీ తిరుమలకు భక్తులు చేరుకుంటున్నారు. అయితే సామాన్య భక్తులు ఇబ్బందులు పడకుండా సులువుగా దర్శనం అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు.

**బయట వరకూ క్యూ లైన్ లు...**

ముందుగా బుక్ చేసుకున్న ప్రత్యేక దర్శనం టిక్కెట్లు పొందిన భక్తులతో పాటు కాలినడకన వచ్చే భక్తులు, ఎస్.ఎస్.డి టోకెన్లను తీసుకుని వచ్చే భక్తులు, శ్రీవాణి దర్శనం ద్వారా వచ్చే భక్తులు ఇలా తిరుమలలో రద్దీ కొనసాగుతుంది. తిరుమలలో వీధులన్నీ గోవింద నామస్మరణలతో మారుమోగిపోతున్నాయి. ఎక్కడ చూసినా భక్తులు కనిపిస్తున్నారు. బయట వరకూ క్యూ లైన్ విస్తరించి ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**అన్ని కంపార్ట్ మెంట్లు నిండి...**

ఈరోజు తిరుమలలోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపోయాయి. బయట కృష్ణతేజ గెస్ట్ హౌస్ వరకూ భక్తుల క్యూ లైన్ విస్తరించింది. ఉచిత దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం పద్దెనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనం భక్తులకు ఆరు గంటలకుపైగానే సమయం పడుతుంది. మూడు వందల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 87,536 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 35,120 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 3.33 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు.

# హెయిర్ క్లిప్, కత్తితో రైల్వే ప్లాట్ ఫామ్ పైనే ప్రసవం..
# ఆడబిడ్డకు ప్రాణం పోసిన ఆర్మీ డాక్టర్..






**హైదరాబాద్ పెన్ పవర్:** వైద్యో నారాయణో హరి అనే నానుడిని నిజం చేస్తూ ఓ డాక్టర్ రైల్వే ప్లాట్ ఫారంపైనే ప్రసవం చేసి.. బిడ్డకు ప్రాణం పోశారు ఓ ఆర్మీ డాక్టర్. హెయిర్ క్లిప్, చిన్న కత్తెర సాయంతో డెలివరీ చేసి ఓ ఆడబిడ్డకు ప్రాణం పోశారు. శనివారం ( జులై 5 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పన్వేల్ – గోరఖ్ పూర్ ఎక్స్ ప్రెస్ లో ప్రయాణిస్తున్న ఓ గర్భిణికి ప్రసవ నొప్పులు రావడంతో ఝాన్సీ స్టేషన్లో దింపేశారు రైల్వే అధికారులు. ఈ క్రమంలో గర్భిణి ప్రసవ వేదన గమనించిన రైల్వే స్టేషన్ సిబ్బంది అక్కడే రైలు కోసం వేచి ఉన్న ఆర్మీ డాక్టర్ కు సమాచారం అందించారు. ఆర్మీ మెడికల్ కార్ప్స్ లో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిత్ బచ్ వాలా చాకచక్యంగా వ్యవహరించి ఆమెకు ప్రసవం చేసి... ఆడబిడ్డకు ప్రాణం పోశారు. సరైన ఆపరేషన్ థియేటర్ అందుబా టులో లేకపోవడంతో తన దగ్గర ఉన్న పరికరాలతోనే ప్రసవం చేయాల్సి వచ్చిందని తెలిపారు డాక్టర్. బొడ్డు తాడును బిగించడానికి, నేను హెయిర్ క్లిప్‌ను ఉపయోగించానని... బిడ్డ స్థిరంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాత పాకెట్ కత్తితో దానిని కట్ చేశానని తెలిపారు.

తల్లి, బిడ్డ డేంజర్ లో ఉన్నప్పుడు ప్రతి సెకను కీలకమైనవి అని అన్నారు డాక్టర్ రోహిత్. లిఫ్ట్ దగ్గర ప్రసవ వేదన అనుభవిస్తున్న మహిళను చూశానని.. తీవ్రమైన ప్రసవ నొప్పి కారణంగా ఆమె సొమ్మసిల్లిందని అన్నారు. ఆమె పరిస్థితి చూసిన వెంటనే అప్రమత్తమై తాత్కాలిక లేబర్ రూమ్ సృష్టించానని అన్నారు డాక్టర్. అందుబాటులో ఉన్న సామగ్రితో పరిసరాలు శుభ్రపరిచామని తెలిపారు. ఆ సమయంలో తాను అక్కడ ఉండటం దైవ నిర్ణయమని అన్నారు.

ప్రసవం తర్వాత, తల్లి మరియు బిడ్డ ఇద్దరినీ అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారని.. ప్రస్తుతం ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు రైల్వే సిబ్బంది తెలిపారు.

# టెక్నాలజీతో కొత్త ముప్పు..
# మీ మెదడును హ్యాక్ చేయొచ్చు!

- మెదడును హ్యాక్ చేయడం సైన్స్ ఫిక్షన్ కాదని హెచ్చరిస్తున్న నిపుణులు
- బ్రెయిన్-కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీతో కొత్త ముప్పులు
- మెదడు నుంచి వచ్చే సిగ్నల్స్ దొంగిలించి ఆలోచనలు తెలుసుకునే ప్రమాదం
- మానసిక స్వేచ్ఛను కాపాడేందుకు 'కాగ్నిటివ్ లిబర్టీ' హక్కు అవసరమన్న వాదన
- మెదడుకు సైబర్ భద్రత కల్పించేందుకు వస్తున్న 'న్యూరోసెక్యూరిటీ' రంగం



**హైదరాబాద్ పెన్ పవర్:** మనిషి మెదడును హ్యాక్ చేయడం అనేది ఇప్పటివరకు సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో చూశాం. కానీ, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఇది భవిష్యత్తులో నిజమయ్యే ప్రమాదం ఉందని న్యూరోసైన్స్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా బ్రెయిన్–కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీ ఈ సరికొత్త ముప్పునకు దారులు తెరుస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**టెక్నాలజీతో ముప్పు ఎలా?**

ఆలోచనల ద్వారా కంప్యూటర్లు, ఇతర పరికరాలను నియంత్రించేందుకు బీసీఐ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. శరీరంలో అమర్చే ఇంప్లాంట్లు లేదా తలపై ధరించే సెన్సార్ల ద్వారా ఇది పనిచేస్తుంది. అయితే, ఈ సాంకేతికతే హ్యాకర్లకు ఒక ఆయుధంగా మారవచ్చని కార్నెల్ యూనివర్సిటీ అధ్యయనం హెచ్చరించింది. హ్యాకర్లు మెదడు నుంచి కంప్యూటర్‌కు వెళ్లే డేటాను అడ్డగించి, మన ఆలోచనలను చదివే ప్రమాదం ఉందని పరిశోధకులు చెబుతున్నారు.

అంతేకాదు, మెదడుకు పంపే సిగ్నల్స్‌ను తారు మారు చేసి మన భావోద్వేగాలు, నిర్ణయాలు, ప్రవర్తనను కూడా ప్రభావితం చేయవచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు, పార్కిన్సన్ వ్యాధిగ్రస్తులకు వాడే డీప్–బ్రెయిన్ స్టిమ్యులేటర్లను హ్యాక్ చేసి, మెదడు పనితీరును మార్చేయగలరని యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ గ్లోబల్ క్యాంపస్ నివేదిక పేర్కొంది.

**మానసిక స్వేచ్ఛకు గ్యారెంటీ ఏది?**

ఈ టెక్నాలజీ వల్ల 'న్యూరోప్రైవసీ' అనే కొత్త సమస్య తెరపైకి వచ్చింది. మన మెదడులోని డేటా బయటకు తెలిస్తే, అనారోగ్య సమస్యలు లేదా వ్యక్తిగత ఆలోచనలు బహిర్గతమవుతాయి. దీన్ని నిపుణులు 'కాగ్నిటివ్ లిబర్టీ' (మానసిక స్వేచ్ఛ) ఉల్లంఘనగా అభివర్ణిస్తున్నారు. ప్రతి వ్యక్తికి తమ ఆలోచనలపై పూర్తి నియంత్రణ, గోప్యత ఉండే హక్కును కల్పించాల్సిన అవసరం ఉందని టైమ్ నివేదిక నొక్కి చెప్పింది.

**పరిష్కారంగా 'న్యూరోసెక్యూరిటీ'!**

అయితే, ప్రస్తుతం విస్తృత స్థాయిలో 'మైండ్ కంట్రోల్' చేసేంత శక్తివంతమైన టెక్నాలజీ అందుబాటులో లేదని యునెస్కో కొరియర్ స్పష్టం చేసింది. అయినప్పటికీ, భవిష్యత్ ముప్పును ఎదుర్కొనేందుకు నిపుణులు 'న్యూరోసెక్యూరిటీ' అనే కొత్త విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. కంప్యూటర్లను కాపాడే సైబర్ సెక్యూరిటీ తరహాలోనే, మెదడుకు అనుసంధానించిన పరికరాలను ఎన్‌క్రిప్షన్, సురక్షిత ప్రోటోకాల్స్ ద్వారా రక్షించడమే దీని లక్ష్యం. బీసీఐ టెక్నాలజీ వైద్య రంగం నుంచి వినియోగదారుల చేతికి వస్తున్న తరుణంలో, కఠినమైన భద్రతా నియమావళి, నైతిక మార్గదర్శకాలు తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్నారు.

# గురు పౌర్ణమి 2025: జులై 10 న ఇలా చేయండి .. కెరీర్‌లో సక్సెస్ పొందుతారు..!

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రతి ఒక్కరు కెరీర్? లో సక్సెస్? పొందాలనుకుంటారు. కొంతమంది ఈ విషయంలో విజయం సాధించగా మరికొంతమందికి అడ్డంకులు ఏర్పడుతాయి. అలాంటి వారు గురు పౌర్ణమి రోజున ( ఆషాఢమాసం.. పూర్ణిమ) జులై 10 కొన్ని పరిహారాలు పాటిస్తే ఆదోషం తొలగిపోయి.. జీవితంలో సక్సెస్? సాధిస్తారని పండితులు చెబుతున్నారు. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం. . .!

విద్యలో ఎంత రాణించినా.. ఎన్ని తెలివితేటలున్నా.. ఉన్నా కాని కెరీర్? లో మాత్రం అనుకున్న స్థానాన్ని పొందలేదు. అలాంటి వారు తెలిసో... తెలియక గురువులను అవమానపరిచారని అలాంటి వారు కెరీర్? లో సక్సెస్? సాధించలేరని పద్మ పురాణం ద్వారా తెలుస్తుంది. మానవులు జీవితంలో ఆచరించే ప్రతి పనికి పురాణాల్లో కొన్ని విషయాలను ప్రామాణికంగా తీసుకుంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం.. జులై 10 న ఆషాఢ పౌర్ణమి తిథి రోజున గురు పౌర్ణమి జరుపుకుంటాము. . ఈ ఆరోజు కొన్ని పరిహారాలు పాటిస్తే జీవితంలో సక్సెస్? సాధిస్తామని పురాణాలు చెబుతున్నాయి. సనాతన ధర్మంలో గురువుకు భగవంతునితో సమానమైన హోదా ఉంది. ఆ రోజున ( జులై 10) గురువును.. తండ్రిని పూజించాలి. ఇలా చేయడం దో షాలు తొలగిపోతాయని పండితులు అంటున్నారు. అంతేకాదు గురువులకు




కొన్ని రకాల వస్తువులను దానం చేయాలి. గురువు అందుబాటులో లేకపోతే... దేవాలయంలో పూజారిని గురువుగా భావించి వారికైనా ఇవ్వాలి.

గురు బ్రహ్మ, గురు విష్ణుః, గురు దేవో మహేశ్వరః.
గురు సాక్షాత్? పరబ్రహ్మ...తస్మై శ్రీ గురవే నమ:

ఈ రోజున గురువును ఆరాధించడం వలన పిత్రు దోషం, గురు గ్రహం యొక్క చెడు ఫలితాలు తొలగిపోతాయి. జ్ఞానం, శ్రేయస్సు కలుగుతాయి. ఏమేమి దానం చేయాలంటే...

**దుస్తులు:** పసుపు రంగు దుస్తులను గురు పౌర్ణమి నాడు గురువుకు ఇవ్వడం మంచిది. ఇది నిజానికి శుభ ఫలితాలను అందిస్తుంది. ఇలా చేయడం గురు గ్రహానికి సంతోషం కలుగుతుంది. గురువు విద్య్ఞానం కలుగచేస్తాడు. ఇలా పసుపు రంగు వస్త్రాలను గురువుకు దానం చేస్తే కెరీర్‌లో సక్సెస్‌ను కూడా పొందవచ్చని పండితులు చెబుతున్నారు.

**స్వీట్స్ :** పసుపు రంగులో ఉండే స్వీట్లను గురువుకు ఆరోజు ( జులై 10) ఇవ్వడం మంచిది. అలా చేయడం వలన గురు గ్రహం అనుకూలంగా ఉంటుంది. పిత్రు దోషాల నుండి బయటపడేందుకు ఉపయోగపడు తుంది. అనుకున్న పనులు పూర్తవుతాయి.

**పసుపు:** గురువుకు పసుపును ఇచ్చి పాదాభివందనం చేయాలి. పసుపు స్వచ్ఛతకు చిహ్నం. పసుపును గురువుకు ఇవ్వడం వలన అనారోగ్య సమస్యలు, పేదరికం, జీవితంలో అడ్డంకులు తొలగిపోతాయి. వైవాహిక జీవితం సంతోషంగా, ప్రశాంతంగా ఉంటుంది.

**పండ్లు:** పసుపు రంగు పండ్లను గురు పౌర్ణమి నాడు గురువుకు ఇవ్వడం మంచిది. అరటి పండ్లు, మామిడి పండ్లు వంటి వాటిని గురువుకు ఇవ్వడం వలన గురు గ్రహ అనుగ్రహం లభిస్తుంది. తెలివి తేటలు పెరుగుతాయి... అదృష్టం కూడా వస్తుంది. అందుకే పెద్దలకు తాంబూలం ఇచ్చే సమయంలో తమలపాకులు అరటిపండ్లు ఇస్తారు.

**పూలు:** పసుపు రంగులో ఉండే సంపంగి పూలు, చామంతి పూలు వంటి పూలను గురువుకు ఇవ్వండి. మెదడు ప్రశాంతంగా మారుతుంది, గురు గ్రహం అనుగ్రహం పొందుతారు. గురు పౌర్ణమి నాడు ఈ వస్తువులను గురువుకు ఇవ్వడం వలన జీవితంలో ఉన్న సమస్యలన్నీ తొలగిపోతాయి, సంతోషంగా ఉండవచ్చు. పూర్వీకుల ఆశీర్వాదాలు లభిస్తాయి. గురు గ్రహం నుండి శుభ ఫలితాలను పొందవచ్చు, జీవితం సంతోషంగా ఉంటుంది.

# నెలరోజులుగా కనిపించని జి జిన్ పింగ్.. చైనాలో నిశ్శబ్ద తిరుగుబాటు?

**హైదరాబాద్ పెన్ పవర్:**చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్?పై ఇటీవల నిశ్శబ్ద తిరుగుబాటు జరుగుతోందనే పుకార్లు అంతర్జాతీ యంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మే చివరి నుంచి జిన్‌పింగ్ ప్రజా సమక్షంలో కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోస్తుంది.

చైనా వంటి కమ్యూనిస్ట్ దేశాలలో రాజకీయాలు అత్యంత రహస్యంగా ఉంటాయన్నది తెలిసిందే కాబట్టి ఈ పుకార్లను ధృవీకరించడం లేదా తోసిపుచ్చడం కష్టం. ఈ విషయంలో కొన్ని అంశాలు ఈ నిశ్శబ్ద తిరుగుబాటుకు సంబంధించిన వాదనలకు బలం చేకూర్చుతున్నాయి.

**నిశ్శబ్ద తిరుగుబాటుకు సంకేతాలు ,ఊహాగానాలు:**

జి జిన్‌పింగ్ అదృశ్యం.. మే 21 నుంచి జిన్‌పింగ్ ప్రజా సమక్షంలో కనిపించడం లేదు. సాధారణంగా చైనా అధికారిక మీడియాలో నిత్యం కనిపించే జిన్‌పింగ్ ఆకస్మికంగా అదృశ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో కూడా జిన్‌పింగ్ ఇలా అదృశ్యమైనప్పటికీ ఈసారి అది అంతర్గత రాజకీయ మార్పులతో ముడిపడి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. హు జింటావో వర్గం ప్రభావం: జిన్‌పింగ్ ప్రత్యర్థిగా భావించే మాజీ అధ్యక్షుడు హు జింటావో వర్గానికి చెందిన సీనియర్ కమ్యూనిస్ట్ పార్టీ నేతలు ఇప్పుడు తెరవెనుక నిజమైన అధికారాన్ని కలిగి ఉన్నారని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. సెంట్రల్ మిలిటరీ కమిషన్ (%జవీజ%) మొదటి వైస్



ఛైర్మన్ జనరల్ జాంగ్ యూక్జియా హు జింటావో వర్గం మద్దతుతో తెరవెనక అధికారాన్ని చలాయిస్తున్నారని ప్రచారం సాగుతోంది. సైనిక అధికారుల తొలగింపులు: జిన్‌పింగ్‌కు విధేయులైన డజన్లకొద్ది జనరల్స్ ను పదవుల నుంచి తొలగించారని ఇది పార్టీలో అంతర్గత ప్రక్షాళనలు సూచిస్తోంది. ప్రజా మీడియాలో జిన్‌పింగ్ ప్రస్తావన తగ్గడం: సాధారణంగా జిన్‌పింగ్ ప్రస్తావనతో నిండి ఉండే చైనా ప్రభుత్వ మీడియా జిన్‌పింగ్‌పై ఇంటర్వ్యూలను గణనీయంగా తగ్గించింది. చైనాకు వచ్చే విదేశీ ప్రముఖుల తక్కువ ర్యాంక్ పార్టీ అధికారులు రిసీవ్ చేసుకోవడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చింది. BRICS సదస్సుకు గైర్హాజరు: బ్రెజిల్‌లో జరగనున్న BRICS సదస్సుకు జిన్‌పింగ్ హాజరుకావడం లేదు. ఇది గత 12 యేళ్లలో చైనా నాయకుడు ఈ సదస్సుకు గైర్హాజరు కావడం ఇదే మొదటిసారి. చైనాకు ఇందులో కీలక పాత్ర ఉన్నప్పటికీ జిన్‌పింగ్ రాకపోవడం అతని ప్రభావం తగ్గుతోందని సంకేతంగా భావించవచ్చు. వాంగ్ యాంగ్ తదుపరి నాయకుడిగా ప్రస్తావన: వాంగ్ యాంగ్ తదుపరి నాయకుడిగా వస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. వాంగ్ యాంగ్ ఉదారవాద, సంస్కరణల వైపు మొగ్గుచూపే నేతగా పేరుపొందారు. ఆర్థిక సమస్యలు ,అసంతృప్తి: చైనా ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. నిరుద్యోగం పెరుగుతోంది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతోంది. ఇలాంటి సంక్షోభాల క్రమంలో జిన్‌పింగ్ నాయకత్వంపై ప్రజలు, వ్యాపారవ ర్గాలలో అసంతృప్తి పెరుగుతోంది. ఇది చైనాలో జిన్‌పింగ్ ప్రభావాన్ని క్రమంగా తగ్గిస్తుందని భావిస్తున్నారు. షాంఘై సహకార సంస్థ సదస్సు (2022) పుకార్లు: గతంలో 2022లో షాంఘై సహకార సంస్థ సదస్సు నుంచి తిరిగి వచ్చిన తర్వాత జిన్‌పింగ్ కొంతకాలం కనిపించలేదు. అప్పుడు కూడా తిరుగుబాటు పుకార్లు వ్యాపించాయి. అయితే అప్పట్లో అది కోవిడ్-19 నిబంధనల ప్రకారం తప్పనిసరి క్వారంటైన్ వల్ల అని కొందరు విశ్లేషకులు తోసిపుచ్చారు.

**చైనా రాజకీయాల్లో అస్పష్టత(పికాలజీ ):**

చైనా రాజకీయాలు అత్యంత అస్పష్టంగా ఉంటాయి. పారదర్శకత లేకపోవడం వల్ల, నాయకుల అదృశ్యాలు లేదా అధికారిక ప్రకటనలలో సూక్ష్మమైన మార్పులు తీవ్రమైన ఊహాగానాలకు దారితీస్తాయి. కోల్డ్ వార్ సమయంలో పాశ్చాత్య విశ్లేషకులు చైనా రాజకీయాలను అర్థం చేసుకోవడానికి "పికాలజీ" అనే పద్ధతిని ఉపయోగించేవారు. దీనిలో పీపుల్స్ డైలీలో ప్రచురించిన ప్రకటనలు, అధికారిక ఫోటోలు, సమావేశాలలో సీటింగ్ అమరికలు వంటి చిన్నపాటి సంకేతాలను విశ్లేషించి అంతర్గత మార్పులను అంచనా వేసేవారు. జిన్‌పింగ్ పాలనలో అస్పష్టత మరింత పెరిగినందున ఈ "పికాలజీ" పద్ధతి మళ్లీ ప్రాముఖ్యత సంతరించుకుంది.
జిన్‌పింగ్‌పై

నిశ్శబ్ద తిరుగుబాటు జరిగిందా లేదా అనేది అధికారికంగా ధృవీకరించబడనప్పటికీ ఆయన ఆకస్మిక అదృశ్యం, సైనిక అధికారుల తొలగింపులు, రాష్ట్ర మీడియాలో ప్రస్తావన తగ్గడం, మాజీ నాయకుల వర్గం క్రీయశీలకం వంటి పరిణామాలు చైనాలో అంతర్గత రాజకీయ ప్రకంపనలు జరుగుతున్నాయనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. చైనా రాజకీయాలు రహస్యంగా ఉండటం వల్ల, భవిష్యత్తులో ఏం జరుగుతుందో స్పష్టమైన సమాచారం తెలిసేందుకు కొంతసమయం పట్టవచ్చు.

## పాశమైలారం ఘటన.. 41కి చేరిన మృతుల సంఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**పాశమైలారం సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 41కి చేరింది. ధృవ ఆస్పత్రిలో ఆరు రోజులుగా చికిత్స పొందుతోన్న సతీష్ అనే వ్యక్తి జులై 6న మృతి చెందాడు. లేటెస్ట్ గా మరో మృతదేహాన్ని గుర్తించారు అధికారులు.. ఇంకా తొమ్మిది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. మృతుల కుటుంబాలు పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర పడిగాపులు గాస్తున్నారు. మరో వైపు ఈ ఘటనలో ఇంకా సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. ఎస్ డీఆర్ఎఫ్,హైడ్రా సిబ్బంది భవన ఇథిలాలను పూర్తిస్థాయిలో తొలగిస్తోంది. వీటిని పక్కనే మరో చోట డంప్ చేసిన తర్వాత.. అందులో గాలిస్తుండగా రెండు ఎముకలు బయటపడ్డాయి. దీంతో ఇంకా ఏమైనా అవశేషాలు దొరుకుతాయేమోననే అనుమానంతో రెస్క్యూ టీం ప్రయత్నాలు చేస్తోంది. అయితే శిథిలాల తొలగింపు నిరంతరాయంగా కొనసాగుతున్నా, ఇంకా తొమ్మిది మంది ఆచూకీ మాత్రం దొరకడం లేదు. ఈ ఘటనలో మృతులకు ఒక్కొక్కరికి రూ. కోటి పరిహారం ఇస్తున్నట్లు సిగాచీ పరిశ్రమ ప్రకటించిన సంగతి తెలిసిందే. కంపెనీని మూడు నెలల పాటు క్లోజ్ చేస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వం సీఎస్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ సిగాచీ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తోంది.

## తొలి ఏకాదశి సందర్భంగా మదన పోచమ్మ ఆలయంలో మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ పెన్ పవర్:**చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించిన మంత్రి వివేక్ వెంకటస్వామి తొలిఏకాదశి సందర్భంగా చెన్నూరు మదన పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ తొలి ఏకాదశి మరియు మొహరం పండగల శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.దేవుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా, సమృద్ధిగా ఉండాలని.. ఈ ఏడాది వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షించారు మంత్రి వివేక్.
తొలి ఏకాదశి అంటే పండగల శుభారంభమని.. రాష్ట్ర అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుతున్నానని అన్నారు. ఒకప్పుడు అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణను అన్ని రంగాల్లో ముందుండే రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను నిష్టతో అమలు చేస్తున్నాం అని పేర్కొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

# అమెరికాలో అల్లు అర్జున్ సందడి: 'తెలుగువారంటే ఫైర్ కాదు, వైల్డ్ ఫైర్'



**హైదరాబాద్ పెన్ పవర్:**అల్లు అర్జున్ ఈ పేరు వింటే చాలు చాలు అభిమానులకు పూనకాలే. నటన, డ్యాన్స్, స్టైల్, స్వాగ్.. ఇలా ప్రతీ విషయంలోనూ తనదైన ముద్రవేసుకున్నారు . తాజాగా తన మాటలతో మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు ఈ ఐకాన్ స్టార్. అమెరికాలోని టాంపా వేదికగా జరిగిన 'నాట్స్ 2025' ( ఉత్తర అమెరికా తెలుగు సొసైటీ ) 8వ అమెరికా తెలుగు సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రాఘవేంద్రరావు, దర్శకుడు సుకుమార్, నిర్మాత దిల్ రాజు, అల్లు అర్జున్, శ్రీలీలతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సందడి చేశారు. ఈ సందర్భంగా అల్లుఅర్జున్ మాట్లాడుతూ.. తెలుగువారు ఎక్కడ ఉన్నా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇక్కడ మన తెలుగువారిని చూస్తుంటే హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నట్లే అనిపిస్తుందన్నారు.

**'తెలుగువారంటే.. ఫైర్ అనుకుంటున్నారా.. వైల్డ్ ఫైర్'**

ఇంతటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్ సంస్థకు అల్లు అర్జున్ ధన్యవాదాలు తెలిపారు. నాట్స్ అంటే నేషనల్ అనుకుంటారా? ఇంటర్నేషనల్!" అని హాస్యంగా నాట్స్ ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు . అటు పుష్ప స్టైల్ లో డైలాగ్ చెప్పి అందరిని అలరించారు. 'తెలుగువారంటే.. ఫైర్ అనుకుంటున్నారా.. వైల్డ్ ఫైర్' అంటూ డైలాగ్ చెప్పడంతో సభా ప్రాంగణం ఒక్కసారిగా అభిమానుల ఈలలు, కేరింతలతో మార్మోగింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఇది వైరల్‌గా మారింది.

దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ, "అడవి రాముడు చిత్రంలో అడవిని నమ్మి స్టార్ డైరెక్టర్ అయ్యాను. సుకుమార్ 'పుష్ప'లో అడవిని నమ్మి స్టార్ డైరెక్టర్ అయ్యాడు. అల్లు అర్జున్‌ను స్టార్ హీరోగా తీర్చిదిద్దాడు" అని అన్నారు. ఇద్దరం అడివిని నమ్ముకుని స్టార్ డమ్ సొంతం చేసుకున్నామని

గుర్తుచేశారు. సుకుమార్ మాట్లాడుతూ, "అమెరికాలోని తెలుగు ప్రజలు '1 నేనొక్కడినే' చిత్రాన్ని ఆదరించడంతో నాకు మరో సినిమా అవకాశం వచ్చింది. అలాగే నవీన్‌ను నిర్మాతగా పరిచయం చేసినందుకు కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ సంస్థ ఎంతో మందికి ఉపాధి కల్పించింది" అని తెలిపారు. అటు ఈకార్యక్రమంలో శ్రీలీల తన డ్యాన్స్ తో, దేవిశ్రీ ప్రసాద్ సంగీత విభావరితో అలరించారు..

# నాలుగు రోజులు హెవీ రెయిన్స్.. అలెర్ట్ గా ఉండాల్సిందే

**హైదరాబాద్ పెన్ పవర్:**రెండు తెలుగు రాష్ట్రాల్లో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పింది. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణితో పాటు నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతుండ టంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పింది. అనేక చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షాలు, ఇంకొక చోట తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని కూడా వాతావరణ శాఖ తెలిపింది. బలమైన ఈదురుగాలు కూడా వీస్తాయని తెలిపింది.




**ఈ నెల 9వ తేదీ వరకూ...**

తెలంగాణలో ఈ నెల 9వ తేదీ వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ చెప్పింది. తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పంది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని కూడా వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.సంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాల్ పల్లి, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో నేడు వర్షాలుపడతాయని తెలిపింది.

**ఇక్కడ భారీ వర్షాలు...**

ఇక అమరావతి వాతావరణ కేంద్రం కూడా రాష్ట్రంలో భారీ వర్షాలు పడతాయని తెలిపింది. గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా పేర్కొంది. కోస్తాంధ్రలోని గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దేశంలోనూ మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని, ప్రయాణాలుపెట్టుకున్న వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది.

# చాతుర్మాస దీక్ష ( జులై 6 నుంచి నవంబర్ 2వరకు ) : నాలుగు నెలల పాటు పాటించాల్సిన నియమాలు ఇవే..!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆషాఢ శుద్ధ ఏకాదశి ( జులై 6 ) నుంచి కార్తీక మాసంలో వచ్చే ప్రభోదిని ఏకాదశి వరకు ( నవంబర్ 2 ) నాలుగు నెలల పాటు చాతుర్మాస దీక్ష ను ఆచరిస్తారు.హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం, దేవశయని ఏకాదశి రోజున ( జులై 6) శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్తాడని భక్తుల నమ్మకం. . ఈ యోగ నిద్ర నాలుగు నెలల పాటు కొనసాగి, ప్రబోధిని ఏకాదశి రోజున స్వామివారు తిరిగి మేల్కొంటారు. ఈ నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాసం అంటారు.

చాతుర్మాస్యం: వ్రత నియమాలు

**ఏకభుక్త మధశ్శయ్యా బ్రహ్మచర్య మహింసనమ్**
**వ్రతచర్యా తపశ్చర్యా కృచ్ఛచాంద్రాయణాదికమ్**
**దేవపూజా మంత్రజపో దశైతే నియమాః స్మృతాః**

ఇక చాతుర్మాస్య వ్రతంలో భాగంగా ఉదయాన్నే స్నానం చేయాలి. క్షురకర్మలు చేయరాదు. నాలుగు నెలలు బ్రహ్మచర్యం పాటించాలి. రోజూ ఒకే పూట భోజనం చేయాలి. ఏకాదశి తిథుల్లో ఉపవాసం ఉండాలి. నేలపై నిదురించాలి. అహింస పాటించాలి. యోగాభ్యాసం చేయాలి. దానధర్మాలు చేయాలి. ఇష్టదేవతల అష్టోత్తర శత, సహస్ర నామావళి పారాయణం చేయాలి.చాతుర్మాస్య వ్రతం ఆచరించే వారికి విష్ణుమూర్తి అనుగ్రహం కలుగుతుంది. మోక్ష ప్రాప్తి లభిస్తుందని పద్మ పురాణం చెబుతోంది.చాతుర్మాస్యాన్ని అన్ని ఆశ్రమాల (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస) వారు పాటించవచ్చు. ఈ వ్రతాన్ని ఆచరించడానికి కుల, వర్గ నియమాలు కానీ, లింగ వివక్ష కానీ లేదని పండితులు చెబుతున్నారు.చాతుర్మాస్య





వ్రతం ప్రధానంగా ఆరోగ్యానికి సంబంధించినది.

చాతుర్మాస్య వ్రతం పాటించే విధానం

చాతుర్మాస వ్రతము పాటించేవారు. ఆహార నియమాలలో భాగంగా శ్రావణ మాసంలో ఆకుకూరలను.... భాద్రపద మాసంలో పెరుగును....ఆశ్వయుజ మాసంలో పాలను...కార్తీక మాసంలో పప్పు పదార్థాలను విధిగా వదిలి పెట్టాలి. వాటిని ఆహారముగా ఏ మాత్రము స్వీకరించ కూడదు .పాత ఉసిరి కాయ పచ్చడి మాత్రం వాడవచ్చును

భాగవతం వంటి గాథలు వింటూ ఆధ్యాత్మిక చింతనతో ఈ నాలుగు నెలలూ గడపాలి. ఈ నాలుగు మాసాలు తాను నివసించే గ్రామ పొలిమెరలు ( గ్రామం వదలి వెళ్లకూడదు) దాటరాదు. కోవిడ్? కాలంలో ఈ విషయంలో కఠినమైన ఆంక్షలను విధించిన విషయం మనందరకూ తెలిసిందే..! ఈ కాలంలో అరుణోదయవేళ ( తెల్లవారుజామున) స్నానం చేయడం అవసరం. వ్రతకాలంలో బ్రహ్మచర్యం, ఒంటిపూట భోజనం, నేలపై నిద్రించడం, అహింసపాటించాలి.ఇష్టదేవతలకు చెందిన దివ్యమంత్రాన్ని అక్షరలక్షలుగా జపించాలి. ఏదైనా ఒక ఉపనిషత్తును పఠించాలి. భగవద్గీతలోని కొన్ని అధ్యాయాలను కంఠస్థం చేయాలి. యోగసాధన చేయడం శ్రేయస్కరం.దానధర్మాది కార్యాలు విశేష ఫలాన్నిస్తాయి

**కొన్ని ముఖ్య నియమాలు:**

నిత్యం నదీస్నానం చేయాలి. అలా చేయడానికి అవకాశం లేని వారు బోరు దగ్గర కాని.. బావి దగ్గర కాని స్నానం చేయాలి. గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి.... నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధింకురు.. అనే మంత్రాన్ని చదువుతూ స్నానం చేయాలి. అందుకే పీఠాధిపతులు.. స్వామీజీలు నదీతీరంలో గుడారాలు ఏర్పాటు చేసుకొని అక్కడే ఉంటారు.

గురువు గారు ఉపదేశించిన మంత్రాన్ని వీలైనన్ని ఎక్కువసార్లు జపం చేయాలి.

బ్రహ్మచర్యం, ఒంటిపూట భోజనం, నేలపై నిద్రించడం, అహింస వంటి నియమాలు పాటించాలి.

ఇష్ట దేవతను పూజించాలి. నిత్యం రోజూ సాయంత్రం సమయంలో తులసి మొక్క ( అమ్మవారి) దగ్గర ఆవు నెయ్యితో దీపారాధన చేయాలి.

లక్ష్మీ నారాయణులను ఆవాహన చేసి పూజించాలి.. విష్ణు సహస్రనామం పారాయణం చేస్తే కోరిన కోర్కెలుతీరుతాయి. లక్ష్మీ దేవి కటాక్షం కలుగుతుంది. ఒక చదవడం రాకపోయినా.. అవకాశం లేకపోయినా శ్రద్ధగా.. భక్తితో విన్నా అదే ఫలితం కలుగుతుంది.

భగవద్గీతలోని కొన్ని అధ్యాయాలను కంఠస్థం చేయాలి.

కోపం.. అసూయ.. అబద్దాలు ఆడటం.. అహంకారం వంటి భావోద్వేగాలకు దూరంగా ఉండాలి.

చాతుర్మాస సమయంలో ( జులై 6 నుంచి నవంబర్? 2వరకు ) క్షవరం ( జుట్టు కత్తిరించుకోవడం) చేయకూడదు. పూర్వ కాలంలో కనీసం తలను కూడా దువ్వుకునే వారు కాదు.

దానాలు చేయాలి.. పేదలకు అన్నం పెట్టాలి. అన్నిటికంటే గోదానం చాలా శ్రేష్టమైనది. గోవుకు ఆహారం పెట్టినా అంతే ఫలితం లభిస్తుంది.

# విజయనగరం బాంబు పేలుళ్ల కేసుల్లో వేగం పెంచిన ఎన్ఐఏ

**హైదరాబాద్ పెన్ పవర్:**విజయనగరం బాంబు పేలుళ్ల కుట్ర కేసులో ఎన్ఐఏ దర్యాప్తులో వేగం పెంచింది. ఉగ్రవాద మూలాలున్న సమీర్, సిరాజ్ లను ఢిల్లీకి తరలించి విచారించేందుకు ఎన్ఐఏ అధికారులు సిద్ధమవుతున్నారని సమాచారం. మే 16వ తేదీన విజయనగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సిరాజ్, సమీర్ లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని వారికి సహకరించిన వారి గురించి కూడా ఆరా తీసింది. దేశ వ్యాప్తంగా వీరి నెట్ వర్క్ ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఈ విచారణలో ఎన్ఐఏ అధికారులు కూడా పాల్గొన్నారు. హైదరాబాద్, వరంగల్, విజయనగరం, బెంగళూరు నగరాల్లో బాంబు పేలుళ్లకు పాల్పడాలని కుట్ర చేసినట్లు విచారణలో వెల్లడయింది. విదేశాల నుంచి నిధులు వీరికి అందినట్లు కూడా దర్యాప్తులో వెల్లడి కావడంతో ఈ కేసును ఎన్ఐఏ కు అప్పగించాలని కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**దేశ వ్యాప్తంగా బాంబు పేలుళ్లకు...**




విజయనగరంలో ఉంటూ దేశ వ్యాప్తంగా బాంబు పేలుళ్లకు కుట్రపన్నిన ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఢిల్లీకి వెళ్లి విచారిస్తే మరికొన్ని విషయాలు బయటపడే అవకాశాలున్నాయని ఎన్ఐఏ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో నిందితులు సమీర్, సిరాజ్ లు విశాఖపట్నం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ గా ఉన్నారు. వీరిని న్యాయస్థానంలో పిటీషన్ వేసి కస్టడీలోకి తీసుకుని ఢిల్లీకి తరలించాలని ఎన్ఐఏ భావిస్తుంది. అహిం పేరుతో ఒక సంస్థ ఏర్పాటు చేసి బాంబు పేలుళ్ల కుట్రకు ప్లాన్ చేశారని దర్యాప్తుల్లో వెల్లడయింది. సమీర్ పలుమార్లు ఢిల్లీ, ముంబయివెళ్లి రావడంతోపాటు సౌదీ నుంచి నిధులు సిరాజ్ కు అందడంతో ఈ దర్యాప్తును ఎన్ఐఏ విచారిస్తేనే మరింత లోతైన విషయాలు వెలుగు చూస్తాయని అంచనా వేస్తున్నారు.

**సహకరించిన వారిపై...**

ఎన్ఐఏ అధికారులు సిరాజ్, సమీర్ లకు సహకరించినవారిపై ఫోకస్ పెట్టి వారిని అదుపులోకి తీసుకుంటే ఇంకా ఎందరు ఈ గ్యాంగ్ లో ఉన్నారని స్పష్టమవుతుందని తెలియనుంది. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించినప్పటికీ వారు ఢిల్లీ, ముంబయిలో ఎవరెవరిని కలిశారు? వారితో ఏం చర్చించారు? వారి కార్యాచరణ ఏంటి? ఇంకా ఈ గ్రూపులో ఎంత మంది ఉన్నారన్న దానిపై విచారించేందుకు ఎన్ఐఏ అధికారులు సిద్ధమవుతున్నారు. బాంబు పేలుళ్లను దేశ వ్యాప్తంగా జరపాలని కుట్రను భగ్నం చేయడంతో పెద్ద ముప్పు తప్పింది. ఇదే సమయంలో మూలాలను వెతికి వాటిని కూడా తొలగించే దిశగా ఎన్ఐఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా వారిని అదుపులోకి తీసుకుని ఢిల్లీకి తరలించే అవకాశాలున్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

# ముద్రగడ కూతురు...కొడుకు ఆ సీటు నుంచి ఢీ కొడతారా ?



**హైదరాబాద్ పెన్ పవర్:**ముద్రగడ కుటుంబానికి అచ్చి వచ్చిన సీటు నుంచి ఆయన వారసులు ఒకరి మీద ఒకరు పోటీ చేస్తారా. 2029 ఎన్నికల్లో పోటీ పడతారా. అటు చూస్తే కూతురు, ఇటు చూస్తే కొడుకు ఇలా ఇద్దరూ సై అంటారా. ప్రస్తుతం ముద్రగడ ఫ్యామిలీలో పొలిటికల్ ట్విస్టులు చాలా కనిపిస్తున్నాయి.


ముద్రగడ పద్మనాభం తొలిసారి గెలిచిన సీటు తూర్పు గోదావరి జిల్లాలోని ప్రత్తిపాడు. అక్కడ నుంచి 1978, 1983, 1985, 1989 ఇలా వరసగా నాలుగు సార్లు గెలిచారు. ఆయన తండ్రి ముద్రగడ వీరరాఘవయ్య అయితే 1962, 1967లలో రెండు సార్లు వరసగా ఇండిపెండెంట్ గా గెలిచి సత్తా చాటారు.అయితే తనను 1994 ఎన్నికల్లో ఓడించిన ప్రత్తిపాడు నుంచి మళ్లీ పోటీ చేయను అని ముద్రగడ భారీ శపథం చేసి మరీ ఆ వైపు చూడడం లేదు. ఇపుడు తన కుమారుడు గిరిని రాజకీయ వారసుడిగా ప్రకటించారు. ఆయనను ఎమ్మెల్యేగా చూసేందుకు తన తండ్రి తన సొంత నియోజకవర్గం అయిన ప్రత్తిపాడు వైపు ఆయన చూస్తున్నారు. అక్కడ నుంచి 2029 ఎన్నికల్లో పోటీకి వైసీపీ తరపున టికెట్ అయితే గిరికి ఖాయమని అంటున్నారు. ఆయనే ఇప్పటికే ఇంచార్జిగా ఆ పార్టీకి ఉన్నారు.అయితే గిరిని ఇంచార్జిగా నియమించడం మీద వైసీపీలో వర్గ పోరు అయితే సాగుతోంది. గిరికి ఎపుడైతే బాధ్యతలు అప్పగించారో ఆనాటి నుంచి వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు వరుపుల సుబ్బారావు పర్వత ప్రసాద్ పూర్తిగా మౌన ముద్ర దాలుస్తున్నారు. మరో వైపు చూస్తే ముద్రగడకు వ్యతిరేకంగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు మదునూరి మురళీక్రిష్ణం రాజు పావులు కదుపుతున్నారు. ఈ వర్గ పోరుతో ప్రత్తిపాడు వైసీపీ సతమతం అవుతోంది.ఇక కొంతమంది నేతలను సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తమ పార్టీలోకి తీసుకుంటున్నారు ఇక ముద్రగడ మాత్రం ప్రత్తిపాడులో ఒకనాటి రాజకీయ వైభవానికి చూస్తున్నారు. తన కుమారుడికి ఎలాగైనా ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని తపన పడుతున్నారు.అయితే వైసీపీ వర్గాలతో పాటు జనసేనలో చేరిన ఆయన కుమార్తె క్రాంతి కూడా ఇపుడు రాజకీయ ప్రత్యర్థిగా ఎదురు నిలిచారు. ఆమె ఇటీవల కాలంలో ప్రత్తిపాడు మీద కన్ను వేశారు అని అంటున్నారు. టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగానే తనదైన శైలిలో రాజకీయం చేస్తున్నారు.

**వైసీపీలో వర్గ పోరు**

తనకు కలిసి వస్తుందని వారిలో కొందరిని జనసేన వైపు తిప్పుకుంటున్నారు.మరో వైపు తాను కూడా ముద్రగడ రాజకీయ వారసురాలినే అని ఆమె ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ముద్రగడ వైసీపీలో ఉండడం ఆయన పేరుని పద్మనాభరెడ్డి గా మార్చుకోవడం ఇష్టం లేని వర్గాలు ఇపుడు క్రాంతికి మద్దతు ఇస్తున్నాయని అంటున్నారు. ఆమె దాంతో దూకుడు ఒక్కసారిగా పెంచుతున్నారు అని అంటున్నారు.జనసేనలో ఆమెకు ముద్రగడ కుమార్తెగా గుర్తింపు ప్రత్యేకంగా ఉంది. దాంతో 2029 ఎన్నికల్లో ఎలాగైనా టికెట్ పొత్తులో భాగంగా తెచ్చుకుంటే ఏకంగా తన అన్నదమ్ముడు గిరి మీదనే పోటీ చేసి గెలవాలని చూస్తున్నారు. ఈ పరిణామాలతో ముద్రగడకు ఎలా ముందుకు అడుగు వేయాలో అర్థం కావడం లేదని అంటున్నారు.

అయితే జనసేన తరపున క్రాంతి టికెట్ తెచ్చుకుంటే మాత్రం ఆమెని గెలిపించే బాధ్యత మాది అని బలమైన సామాజిక వర్గం అంటోందిట. అపుడు ముద్రగడ కూడా జనసేనలోకి వస్తారని ఊహిస్తోందిట. మొత్తానికి అయితే ముద్రగడకు ఒక వైపు కూతురు ప్రత్యర్థిగా మారితే మరో వైపు కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద పెద్దాయన కలవరపడుతున్నారుట.

# సిగాచీ పరిశ్రమ ప్రమాదం తర్వాత వెలుగు చూస్తున్న నివ్వెరపోయే నిజాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**పాశమైలారం లో సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నలభై మంది కార్మికులు మరణించారు. అయితే ఇండస్ట్రీస్ శాఖకు సంబంధించిన అధికారులు మాత్రం అందించిన నివేదిక నివ్వెర పోయేలా చేస్తుంది. గత ఏడాది డిసెంబరు 12వ తేదీన పరిశ్రమ శాఖ అధికారులు సిగాచీ పరిశ్రమను తనిఖీ చేసినట్టు రికార్డులు చెబుతున్నాయి. ప్రతి ఏటా జరిపే తనిఖీల్లో భాగంగానే సిగాచీ పరిశ్రమను కూడా తనిఖీ చేసినట్లు నివేదికలు తయారు చేశఆరు. నిజామాబాద్ జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్స్ పెక్టర్ ఈ పరిశ్రమ తనిఖీ చేశారు. అయితే అన్ని భద్రతా ప్రమాణాలున్నాయని ఆయన నివేదిక ప్రభుత్వానికి ఇవ్వడం కొసమెరుపు. అంటే ఆరు నెలల ముందు జరిపిన తనిఖీల్లో అంతా బాగానే ఉందని నివేదికలు ఇచ్చిన అధికారులు చేతులు దులుపుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

**పాత కాలం మిషనరీని...**

మరొకవైపు కార్మికులు మాత్రం పాతకాలం నాటి మెషనరీని వినియోగిస్తుండటం వల్లనే ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పటికీ కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి ఈ పరిశ్రమకు కితాబు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఎంత లోతుగా పరిశీలన జరిపారో సంఘటన జరిగిన తర్వాత అర్థమవుతుంది. కేవలం అధికారుల తనిఖీలు జరిగిన ఆరు నుంచి ఏడు నెలల్లోనే భారీ ప్రమాదం సంభవించి నలభై మంది వరకూ ప్రాణాలు కోల్పోయి, పదుల సంఖ్యలో గాయపడ్డారంటే కార్యాలయంలో కూర్చుని నివేదికలు తయారు చేసినట్లు కనపడుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. దీంతో పాటు సిగాచీ పరిశ్రమలోని కార్మికుల ఆరోగ్యానికి ముప్పు లేకుండా ఈ పరిశ్రమ అన్ని రకాల నిబంధనలను పాటించిందంటూ ప్రత్యేకంగా సర్టిఫికెట్ ఇవ్వడం కూడా అధికారిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

**తూతూ మంతంగా...**

చేతులు తడిపితే అంతా బాగానే ఉంటుంది. లోపాలు కనిపించవు. రికార్డుల్లో మాత్రం అద్భుతహా అని రాసి పాడేస్తారన్నది మరోసారి అర్థమమయింది. రియాక్టర్లు, బాయిలర్లు, డ్రయ్యర్లు వంటి వాటిని పరిశీలించి అధికారులు తనిఖీలు నిర్వహించిన తర్వాత భద్రతా ప్రమాణాలపై నివేదిక రూపొందించాలి. థర్డ్ పార్టీ ఏజెన్సీలు తనిఖీలు చేసి ఇచ్చిన నివేదికలను కర్మాగారాల శాఖ అధికారులు ఓకే చెబుతున్నారు. పాత కాలం మెషనరీతో పరిశ్రమను నడుపుతున్నా అంతా బాగుందన్నదన్న సర్టిఫికెట్ ఇవ్వడంపై ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో కూడా చర్చ జరుగుతుంది. సిగాచీ పరిశ్రమ మాత్రమే కాదు అన్ని పరిశ్రమలను ఒకసారి తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు, కార్మికుల ప్రయోజనాలపై నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మరి ఈ తనిఖీల్లోనైనా అసలు విషయాలు వెల్లడిస్తారా? లేదా? అన్నది చూడాలి.

# రైతులకు తీపికబురు.. ఈ నెల పదో తేదీ వరకూ ఆఖరు




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో రైతులకు త్వరలో తీపికబురు చెప్పనుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాత-సుఖీభవ పథకం అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. ఇప్పటి వరకూ అన్నదాత సుఖీ భవ పథకం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదు. ఈ మేరకు బడ్జెట్ లో ఈ పథకం కోసం నిధులు కూడా కేటాయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు విడుదల చేసిన సమ యంలో అన్నదాత సుఖీభవ పథకం నిధులు విడుదల చేయడానికి సిద్ధమవతున్నారు. ఇప్పట ికే ఈ పథకం కింద అర్హులైన రైతులను ఎంపిక చేసుకేందుకు కసరత్తు దాదాపుగా పూర్తయింది. మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది.

**ఇప్పటికే గుర్తించని...**

అన్నదాత సుఖీభవ పథకం కింద ఆంధ్రప్రదేశ్ లో 47.77 లక్షల రైతు కుటుంబాలను అర్హులుగా గుర్తించినట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి. అయితే వీరిలో దాదాపు ఎక్కువ శాతం మంది రైతుల ఈ-కేవైసీ పూర్తి అయిందని, మిగిలిన వారు కూడా ఈ కేవైసీని పూర్తి చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. పీఎం కిసాన్ తో కలిపి ఈ నిధులు జమ చేయనున్నారు. ఏడాదికి ఒక్కో రైతుకు ఇరవై వేలు ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వం మాదిరిగానే మొత్తం మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ పథకాన్ని విడుదల చేయనున్నారు. తొలి విడత నిధులు ఈ నెలలో జమ అవుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ ఇంకా డేట్ మాత్రం ఫిక్స్ కాలేదు.

**పదో తేదీ వరకూ...**

మరొక వైపు ఈ పథకం ప్రయోజనం పొందేందుకు గత నెల 30వ తేదీ వరకూ వెబ్ ల్యాండ్ లో నమోదయిన రైతుల భూమి ఖాతాలకు అర్హత కల్పించినట్లు అధికారులు తెలిపారు. అంటే వీరిందరికీ పీఎం కిసాన్ తో పాటు అన్నదాత సుఖీ భవ పథకం నిధులు కూడా అందనున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదులను ఈ నెల పదో తేదీ వరకూ రైతుల ద్వారా రైతు కేంద్రాల వద్ద స్వీకరించనున్నారు. అందులో అర్హత ఉన్నవారందరికీ అవకాశం కల్పిస్తామని చెబుతున్నారు. కావున రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమకు అర్హత అందిందా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. తర్వాత కూడా అర్హత ఉన్న రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింప చేయడానికి అవసరమైన సమయాన్ని అందిస్తామని చెప్పారు.

# కోరుట్ల చిన్నారి హత్య కేసులో ట్విస్ట్... హంతకురాలు ఆవిడేనా!

**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో శనివారం రాత్రి జరిగిన ఐదేళ్ల చిన్నారి హితీక్ష హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. చిన్నారి అదృశ్యమైన కొద్ది గంటలకే పక్కింటి బాత్రూమ్‌లో రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణ ఘటన వెనుక కుటుంబ కలహాలే కారణమని, బాలిక సొంత పిన్ని మమతనే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు బలంగా అనుమానిస్తున్నారు.

వివరాల్లోకి వెళ్తే, శనివారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన హితీక్ష, సమీపంలో జరుగుతున్న వినోద కార్యక్రమం చూసేందుకు వెళ్లింది. తిరిగివచ్చిన కాసేపటి తర్వాత, రాత్రి 7:30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది.



ఆ తర్వాత పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి నవీన, రాత్రి 8:30 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే గాలింపు చేపట్టిన పోలీసులకు, పక్కింటి బాత్రూమ్‌లో గొంతు కోయబడిన స్థితిలో చిన్నారి మృతదేహం లభ్యమైంది.

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా రంగంలోకి దిగి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. కుటుంబ సభ్యులను విచారించగా, కుటుంబంలో ఉన్న విభేదాలే హత్యకు దారితీసి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఉపాధి కోసం గల్ఫ్‌లో ఉన్న చిన్నారి తండ్రి రాములు, విషయం తెలిసి హుటాహుటిన స్వదేశానికి బయలుదేరారు.

**కేసులో పోలీసులను వేధిస్తున్న ప్రశ్నలు**

అయితే, ఈ కేసులో పోలీసులకు పలు చిక్కుముడులు ఎదురవుతున్నాయి. బాలిక మృతదేహం లభ్యమైన ఇంటి యజమాని కొడిపెల్లి విజయ్, తాను వరంగల్ జిల్లా నర్సంపేటలో ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. విజయ్ ఊళ్లో లేకపోతే, బాలిక మృతదేహం అతని ఇంట్లోని బాత్రూమ్‌లోకి ఎలా వచ్చిందనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మరోవైపు, ఇది ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పెద్దపులుల వేషాలను చూసి భయపడిన బాలిక, ఆ ఇంట్లోకి వెళ్లి బాత్రూమ్‌లో దాక్కుందా? ఆ సమయంలో ప్రమాదవశాత్తు నల్లాపై పడి మెడకు గాయమైందా? అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సెల్‌ఫోన్ లోకేషన్లను విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే సుమారు 40 మందిని విచారించి, అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

## వంటల్లో పింక్ సాల్ట్ వాడుతున్నారా... అయితే ఇది మీకోసమే!



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ, సోషల్ మీడియాలో ప్రచారంతో అనేకమంది తమ వంటగదిలోని పదార్థాలను మారుస్తున్నారు. ఈ క్రమంలో సాధారణ టేబుల్ సాల్ట్‌కు బదులుగా హిమాలయన్ పింక్ సాల్ట్, సీ సాల్ట్ వాడకం ఇటీవల ఒక ఫ్యాషన్‌గా మారింది. అయితే, ఆరోగ్యకరమైనదనే అపోహతో వాడుతున్న ఈ ఉప్పు.. తీవ్రమైన ఆరోగ్య ముప్పుకు దారితీస్తోందని దేశవ్యాప్తంగా వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దశాబ్దాల క్రితం మన దేశం విజయవంతంగా ఎదుర్కొన్న అయోడిన్ లోపం సమస్య, మళ్లీ ఇప్పుడు తిరగబెట్టడానికి ఈ పింక్ సాల్ట్ వాడకమే ఒక ప్రధాన కారణంగా వారు అభిప్రాయపడుతున్నారు.

**ఎందుకీ ముప్పు?**

శరీరంలో థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి అయోడిన్ అత్యంత కీలకం. ఈ హార్మోన్లు జీవక్రియను నియంత్రించడంలో, శారీరక ఎదుగుదలలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా గర్భిణులకు, కడుపులో పెరుగుతున్న శిశువు మెదడు అభివృద్ధికి అయోడిన్ చాలా అవసరం. సాధారణ టేబుల్ సాల్ట్‌లో ప్రభుత్వం నిర్దేశించిన మోతాదులో అయోడిన్‌ను ప్రత్యేకంగా కలుపుతారు. కానీ, సహజసిద్ధంగా లభించే పింక్ సాల్ట్, సీ సాల్ట్‌లలో ఈ పోషకం నామమాత్రంగానే ఉంటుంది. ఇది శరీర రోజువారీ అవసరాలకు ఏమాత్రం సరిపోదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**తిరగబెడుతున్న పాత సమస్య**

భారత ప్రభుత్వం 1960ల నుంచి 'జాతీయ గాయిటర్ నియంత్రణ కార్యక్రమం' కింద ఉప్పును అయోడైజ్ చేయడాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ కార్యక్రమం వల్ల కొన్ని దశాబ్దాలుగా గాయిటర్ (థైరాయిడ్ గ్రంథి వాపు), బుద్ధిమాంద్యం వంటి అయోడిన్ లోప సంబంధిత వ్యాధులు గణనీయంగా తగ్గాయి. కానీ, ఇటీవల ఆరోగ్య స్పృహ పేరుతో చాలామంది అయోడైజ్డ్ ఉప్పును పక్కనపెట్టి పింక్ సాల్ట్‌కు మారుతుండటంతో ఈ సమస్య మళ్లీ మొదటికొస్తోందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిపుణుల సూచన ఇదే!**

ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం అయోడిన్ ప్రాముఖ్యతను పదేపదే నొక్కి చెబుతోంది. కేవలం ఫ్యాషన్‌ను, అశాస్త్రీయ ప్రచారాలను నమ్మి పింక్ సాల్ట్‌ను వాడటం ఆరోగ్యానికి హానికరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అయోడైజ్డ్ ఉప్పునే తమ వంటల్లో వినియోగించాలని గట్టిగా సూచిస్తున్నారు. అయోడిన్ లోపాన్ని నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలంలో థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం, పిల్లల్లో మానసిక ఎదుగుదల లోపించడం వంటి తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరిస్తున్నారు.

## సికింద్రాబాద్ వస్తుండగా ఎద్దును ఢీ కొట్టిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్.. ఆ తర్వాత ఏమైందంటే..




**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో వందేభారత్ ఎక్స్?ప్రెస్ రైలుకు పెద్ద ప్రమాదమే తప్పింది. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న వందేభారత్ ఎక్స్?ప్రెస్ ట్రైన్?కి పెను ప్రమాదం తప్పింది. తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అప్ లైన్?లో 428/11 వద్ద వందే భారత్ రైలు ప్రమాదవశాత్తూ ఎద్దును ఢీ కొట్టింది. ఈ ఘటనతో కొన్ని నిమిషాల పాటు రైలు నిలిచిపోయింది.

స్పందించిన రైల్వే సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పట్టాలపై పడి ఉన్న ఎద్దును తొలగించారు. ఈ ఘటనలో రైలు ఇంజన్ ముందు భాగం(క్యాటిల్ గాడ్) విరిగింది. ఉదయం 5.45 గంటలకు విశాఖలో ప్రారంభమై.. మధ్యాహ్నం 2.15కు సికింద్రాబాద్‌కు ఈ రైలు చేరుకుంటుంది. అదే రోజు సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి అర్ధరాత్రి 11.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ రైలు మధ్యలో వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి స్టేషన్లలో ఆగుతుంది. చైర్ కార్ చార్జీలు సికింద్రాబాద్?నుంచి విశాఖపట్నానికి రూ. 1,665గా... విశాఖ నుంచి సికింద్రాబాద్?కు 1,720 రూపాయలు కావడం గమనార్హం.

విశాఖ నుంచి సికింద్రాబాద్?కు వారంలో ఆరు రోజులు వందేభారత్ ట్రైన్ రాకపోకలు సాగిస్తుంది. వందే భారత్ ట్రైన్ ఉదయం విశాఖలో బయల్దేరి మధ్నాహ్నం సికింద్రాబాద్ చేరుకుంటది. తిరిగి సికింద్రాబాద్?లో బయల్దేరి రాత్రికి విశాఖ చేరుకుంటది.